సాక్షి
జనగామ
మంగళవారం | 27 | జూన్ | 2023



'మార్పు' మంచికే..
రైతులు తమ ప్రాంత పరిస్థితులను బట్టి పంట మార్పిడి చేసి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.
- 8లో▸



పనులు త్వరగా పూర్తి చేయాలి
అధికారులు దత్తత తీసుకున్న గ్రామాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/25^0$

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం నుంచి చిరు జల్లులు కురుస్తాయి. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

28న పెన్షనర్ల నిరసన



జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న జిల్లా పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలి రావాలని టీపీఏఆర్‌ఏ జిల్లా అధ్యక్షుడు ఎర్రోజు రామస్వామి పిలుపునిచ్చారు. సోమవారం టీపీఆర్‌పీఏ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, గౌరవ అధ్యక్షుడు సరాబు వీరన్న, జీపీఏటీఎస్ అధ్యక్షుడు ఇమ్మడి జగ్గారెడ్డి, కార్యదర్శి శంకరయ్య, ధర్మయ్య, సంపత్ కుమార్, భుజంగరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గోరక్షకులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



దేవరుప్పుల: దినదినం అంతరించిపోతున్న పశుసంపదను పరిరక్షించుకునేందుకు పార్లమెంటు, అసెంబ్లీ చట్టసభల్లో గోరక్షకులకు ఆయా పార్టీలు బరిలో నిలిచేలా టికెట్లను కేటాయించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ కోరారు. సోమవారం మండలంలోని పడమటితండాలో పరమేశ్వర గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు లేగదూడలను ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవసాయ రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను కల్పించే పశు సంపద పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గోవులను అక్రమ అమ్మకాలు చేపడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోక్యానాయక్, గోశాల ప్రతినిధులు భూక్యా లక్కు, లకావత్ అశోక్, వార్డు సభ్యుడు బిక్కు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి రిమాండ్

జనగామ: జనగామ మండలం పెద్ద పహాడ్ గ్రామంలో ఇటీవల ఓ పంచాయితీ విషయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో గ్రామ పెద్ద మనుషులు సర్పంచ్ భర్త గుండా శ్రీధర్ రెడ్డి, ఏ.మల్లేశం, పిట్టల రవి, జడల రాజు, ఈర్ల బాల నర్సయ్య, ఏ.రాములు, ఏదు దాసును అరెస్ట్ చేసి, ఎస్ఐ సృజన్ కుమార్ వారిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. పెద్ద పహాడ్‌కు చెందిన సామంతుల ఉప్పలయ్యను తిట్టడంతో మనస్తాపానికి గురైన ఆయన, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో తొమ్మిది మందిపై కేసు నమోదు కాగా, పూర్ణ సిద్దమ్మ, ఇట్టబోయిన కమలాకర్‌లు పరారీలో ఉన్నారన్నారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: టీఎస్‌పీఈసెట్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ఫైనలియర్ పూర్తిచేసిన విద్యార్థి గుర్రం దేవాను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, అధ్యాపకులు కరుణాకర్‌రావు, ఫిరోజ్‌పాషా, జితేందర్, సదాశివ, పుల్లా రమేష్, ఆర్.ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ పరీక్షల్లో 22 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ 22 మంది విద్యార్థులు పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. ఖమ్మం వికాస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కవితా డిగ్రీ కళాశాలలో ఒకరు, బోత్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 10 మంది, ఇచ్చోడ సాయిసమత డిగ్రీ కళాశాలలో ఏడుగురు, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మణుగూరు శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయ్యారని వివరించారు.

సమస్యలు పరిష్కరించండి..

మహాప్రభో



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

- ప్రజావాణిలో వినతుల వెల్లువ
- పింఛన్, దివ్యాంగుల సమస్యలే అధికం
- 71 దరఖాస్తుల స్వీకరణ
- తక్షణమే సమస్యలు పరిష్కరించండి
- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్: ప్రజావాణిలో విన్నవించిన సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు హాజరై వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో ఆయా శాఖ అధికారులతో కలిసి ప్రజల నుంచి 71 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 45 రోజుల తర్వాత ప్రజావాణి నిర్వహించడంతో అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

శాఖల వారీగా అందిన ఫిర్యాదులు

రెవెన్యూశాఖకు అత్యధికంగా 50 దరఖాస్తులు రాగా పంచాయతీరాజ్ 7, సివిల్ సప్లయీస్ 2, పురపాలక సంఘం 4, ఇతర శాఖలకు 8, మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయి.

అంత్యోదయ కార్డు ఇచ్చి ఆదుకోవాలి



కుటుంబంలో నలుగురు మంది ఉన్నాం. నాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఉండటానికి ఇల్లు లేదు. తన తల్లితో పాటు చిన్న కుమార్తె ఇంట్లోనే ఉంటుంది. కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం సరిపోవడం లేదు. తమకు అంత్యోదయ కార్డు మంజూరు చేయాలి.

-గోనెపల్లి బాలయ్య, కట్కూర్, బచ్చన్నపేట

అక్రమంగా పట్టా చేసుకున్నారు..



సర్వే నంబర్ 16, 1సీ, 161ఏలో 5.4 ఎకరాలు, అలాగే 41ఏ3, 41డి, 44సీ1, 85సీలో 4.34 ఎకరాల భూమి ఉంది. ఏళ్ల తరబడి ఖాస్తులో ఉన్నాం. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తమ భూమిలో 2 ఎకరాలు మినహా మిగతా భూమి మొత్తం అక్రమంగా పట్టా చేసుకున్నారు. తమకు న్యాయం చేయాలి.

- మంద బుచ్చయ్య,
తమ్మడపల్లి (ఐ), జఫర్‌గఢ్



ఈ ఫొటోలో కనిపిస్తున్న దివ్యాంగ మహిళ కొడకండ్ల మండలం నర్సింగపురం గ్రామానికి చెందిన జీడీ చంద్రకళ. పుట్టుకతోనే రెండు కాళ్లు పడిపోగా నడవలేని పరిస్థితి. చేతి కర్రల కోసం మండల అధికారులను కలిస్తే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లమన్నారు. సోమవారం కలెక్టరేట్‌కు వస్తే పట్టించుకోవడం లేదని వాపోయింది. చేతికర్రలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంది.

పట్టా చేయడం లేదు



తనకు వారసత్వంగా వస్తున్న భూమి ఉప్పుగల్లు గ్రామంలో సర్వే నంబర్ 823, 824, 825లో 7.2 ఎకరాల భూమి ఉంది. అన్నదమ్ముల గొడవతో సమస్య కోర్టు పరిధిలో ఉంది. ఇటీవల పరస్పర అవగాహనతో పట్టా చేసుకోవాలని ఆర్డర్ వచ్చింది. అయితే అధికారులు తమ పేరు మీద భూమిని పట్టా చేయాలని కోరినా.. చేయడం లేదు. మాకు న్యాయం చేయాలి.

- గుంటి గట్టయ్య నమిలిగొండ, స్టేషన్ ఘన్‌పూర్

ఇందిరమ్మ ఇల్లు అక్రమించారు



జనగామ పట్టణంలోని బాణాపురం ఇందిరమ్మ కాలనీలో 2004లో నా భార్య భాగ్యలక్ష్మి పేరు మీద ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నాం. అనారోగ్యంతో భార్య మృతి చెందగా బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లగా కాలనీలో గోనె గట్టయ్య తన ఇల్లును అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడు.

- వేదాటి వెంకట్‌రెడ్డి, గుండ్ల గడ్డ, జనగామ

పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి



అనారోగ్యంతో భర్త అనిల్ మృతి చెందాడు. వితంతు పింఛన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం పింఛన్ కార్డు మంజూరు చేశారు. కాని పింఛన్ రావడం లేదు.

- వజీర్, చైతన్య సాగరం, జఫర్‌గఢ్

ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

- సర్కార్ స్కూల్‌లో చేరిన ప్రైవేట్ విద్యార్థులు
- హెచ్‌ఎం, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఎంఈఓ అభినందనలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, స్థానిక ప్రజా ప్రతినిధుల చొరవతో ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు చేరారు. ఈ నెల 24న హెచ్‌ఎం శాగ కైలాసం, సర్పంచ్ సునిత రాజు, ఉప సర్పంచ్ స్వప్నలు గ్రామానికి వచ్చిన ప్రైవేట్ పాఠశాల బస్సును అడ్డుకొని మా బడికి రండి అని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరిన విషయం విధితమే. వారి ఒత్తిడితో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం 26 మంది పిల్లలను గ్రామ ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. ప్రాథమిక పాఠశాలకు కేవలం 9 మంది విద్యార్థులే వస్తుండగా దాదాపు 40 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెలుతున్నారు. దీంతో వారిని ఎలాగైన గ్రామ బడిలో చేర్పించాలని హెచ్‌ఎం, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకొని మన బడిలోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని బుజ్జగించారు. దీంతో సోమవారం 26 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. సమాచారం తెలుసుకున్న ఎంఈఓ భగవాన్ పాఠశాలకు చేరుకొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రత్యేక చొరవ తీసుకున్న హెచ్‌ఎం, సర్పంచ్, ఉపసర్పంచ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భద్రు, పంచాయతీ కార్యదర్శి మధు, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేషం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్‌లతో గర్భిణులకు మేలు



న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న సుగుణాకర్‌రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: గర్భిణులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషన్ కిట్‌లతో ఎంతో మేలు అని వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, ఘన్‌పూర్ ఎస్సీ బస్తీ, శివునిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని 13 మంది గర్భిణులకు సోమవారం ఘన్‌పూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా డాక్టర్ సుగుణాకర్ రాజు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్‌కుమార్, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, వైద్యులు సంధ్య, ప్రసన్న క్రిష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కరెంటు కోతలు

జనగామ: పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో కొత్తగా విద్యుత్ పోల్స్‌తో పాటు లైన్ ఏర్పాటు చేస్తుండడంతో నేడు (మంగళవారం) కరెంటు కోతలు ఉంటాయని ఎన్పీడీసీఎల్ ఏఈ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలాజీ నగర్ రోడ్డు నంబర్లు 1, 2, 3, 4, 5, 6 ఎల్లమ్మ టెంపుల్, జ్యోతి నగర్ రోడ్ నంబర్లు 1, 2, శ్రీవిల్లాస్ కాలనీ, క్లాం కమాన్ వైపు, సెయింట్ మేరీస్ స్కూల్, కోటిరత్నం హాస్పిటల్, సూర్యాపేట రోడ్, ఎస్‌ఎంఆర్ గార్డెన్, హైదరాబాద్ రోడ్ తూర్పు వైపు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

బక్రీద్‌ను ఆనందంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: ఈ నెల 29న జరుగనున్న బక్రీద్ పండుగ ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతు సంరక్షణ సమితి సూచనల మేరకు పశువుల అక్రమ రవాణా, గోవధ నిషేధం తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచించారు. జంతు సంరక్షణతో పాడి పరిశ్రమ అభివృద్ధి, రైతులు ఆర్థిక లాభాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మనోహర్, డీపీఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ వసంత, ఆర్డీఓ శ్రీనివాస్, డీఎం మార్కెటింగ్ నాగేశ్వర శర్మ, మున్సిపల్ కమిషనర్ రజిత, పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ నరసయ్య, తదితరులు ఉన్నారు.

ఈవీఎంల పరిశీలన

జనగామ కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గోదాంలో కొనసాగుతున్న ఓటింగ్ మిషన్ ఈవీఎం, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్‌ల మొదటి స్థాయి తనిఖీలను సోమవారం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య పరిశీలించారు. ఈసీఐఎల్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది సమక్షంలో పరిశీలన జరుగుతుందన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావెల రవి, బొట్ల శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, సోమయ్య, జోగు ప్రకాష్, వెంకట్ రెడ్డి, జయకుమార్, తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

జనగామ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేశ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కురుమ సంఘం కమిటీ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని దేవరుప్పుల మండలం కడవెండిలో జన్మించిన దొడ్డి కొమురయ్య, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. జనగామ జిల్లా కేంద్రంలోని కురుమ సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన చేసిన గద్దె నిర్మాణాన్ని దేవాదాయ శాఖ అధికారులు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి కూల్చిన గద్దెను రెండు రోజుల్లో తిరిగి నిర్మాణం చేయడంతో పాటు వచ్చే నెల జులై 4న విగ్రహం ఆవిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, గుండా వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుమారస్వామి, రాములు, కర్రె కృష్ణ, మరాఠి జంపన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల అభిప్రాయ సేకరణ



ప్రయాణికుల అభిప్రాయ సేకరణలో ఆర్టీసీ వీఓలు

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ పురోగతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంస్థ ఎండీ విసి సజ్జనార్ ఆదేశాల మేరకు జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో దేవరుప్పుల చౌరస్తాలో సోమవారం విలేజ్ బస్ ఆఫీసర్లు ప్రయాణికుల అభిప్రాయ సేకరణను చేపట్టారు. ఈ సందర్భంగా మారుమూల పల్లెలకు రవాణా సౌకర్యాల మెరుగు, జనగామ సూర్యాపేట రహదారిలో ఎక్స్‌ప్రెస్ సర్వీసు, రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సుల ట్రిప్పుల పెంచాలనే తదితర సమస్యలపై ప్రయాణికులు వివరించారు. ఆర్టీసీలో ప్రయాణించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డుపై ఆర్టీసీ బస్ ఆఫీసర్ పేరు, ఫోన్ నంబర్, వివరాలు పొందుపరుచామని, ఇంకేమైన సందేహాలు ఉంటే ఫోన్ చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల విలేజ్ బస్సు ఆఫీసర్లు బానోత్ రవి, భాషిపాక బాబురావు, మాజీ సర్పంచ్ చింత యాదగిరి, బాషిపాక అబ్బయ్య, జోగు ఐలమల్లు, ఉప్పుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డిపోలో రక్తదానం

జనగామ: జనగామ ఆర్టీసీ డిపోలో నేడు (మంగళవారం) రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదానం చేసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమలోని మానవత్వాన్ని చాటు కోవాలన్నారు.

పోస్టుమార్టం రిపోర్టులో తప్పులేదు

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు

జనగామ: బచ్చన్నపేట మండలం సదాశివునిపేటకు చెందిన సుభద్ర పోస్టుమార్టం రిపోర్టును మార్చి, తప్పుడు సమాచారం ఇచ్చారని కొంతమంది బదునాం చేయడం సరికాదని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు అన్నారు. ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 అక్టోబర్ 20వ తేదీన సుభద్రను జిల్లా ఆస్పత్రికి తీసుకు రాగా, డ్యూటీ డాక్టర్లు అడ్మిట్ చేసుకున్నారన్నారు. ఆమెకు కంటిన్యూగా పిట్స్ రావడంతో ఇంటి వద్ద ఏమైనా సంఘటన జరిగిందా అనే విషయంలో డాక్టర్లు కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. పాము కరిచి ఉండవచ్చని చెప్పారని, ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదన్నారు. ఒంటి నిండా బురద ఉండడంతో.. పాము కాటుకు సంబంధించిన ఇంజక్షన్‌తో పాటు పిట్స్ తగ్గించేందుకు మాత్రలు ఇచ్చామన్నారు. పరిస్థితి కండీషన్‌గా ఉండడంతో 1.15 నిమిషాల పాటు జిల్లా ఆస్పత్రిలో ట్రీట్‌మెంటు చేసి, రెఫర్ చేయడం జరిగిందన్నారు. పెద్దాస్పత్రికి తరలించే క్రమంలో సుభద్ర మార్గ మధ్యలో చనిపోగా కుటుంబ సభ్యులు, ఇక్కడకు రాకుండా, మృత దేహాన్ని ఇంటికి తీసుకువెళ్లినట్లు స్పష్టం చేశారు. ఆమె చనిపోయిన 35 రోజుల తర్వాత, అనేక అనుమానాల నేపథ్యంలో తహసీల్దార్ సమాచారం మేరకు జిల్లా ఆస్పత్రి వైద్యులు పోస్టుమార్టం చేసేందుకు వెళ్లారన్నారు. అందరి సమక్షంలో డాక్టర్లు రాహుల్, ప్రదీప్ టీం నేతృత్వంలో వీడియో రికార్డు పర్యవేక్షణలో పోస్టుమార్టం చేసినట్లు వివరించారు. పోస్టుమార్టం చేసే సమయంలో డాక్టర్లు గుర్తించిన ప్రతి అంశాన్ని నివేదికలో పొందు పరుస్తారన్నారు. మరింత క్లారిటీ కోసం ఫోరెన్సిక్స్‌కు కూడా పంపించినట్లు, ఆ నివేదిక నేరుగా పోలీసులకు చేరుతుందన్నారు. సూపరింటెండెంట్ హోదాలో ఎవరూ కూడా పోస్టుమార్టం చేయరని, కావాలని కొంత మంది తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సుగుణాకర్‌రాజు అన్నారు. అనవసరంగా చేసిన ఆరోపణలపై లీగల్‌గా వెళ్లడంతో పాటు సమాచార కమిషన్‌కు వెళ్తామన్నారు. కాగా దీనిపై జనగామ సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌కు సైతం ఫిర్యాదు చేశామన్నారు. పోస్టుమార్టం చేసిన డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ సుభద్ర బాడీని పోస్టుమార్టం చేసే సమయంలో ఆమెకు ఇంటర్నల్‌గా ఎటువంటి బోన్ ప్యాక్చర్ కాలేదని గుర్తించడం జరిగిందన్నారు.

అబార్షన్ కేసులో రాంగ్ స్టేట్‌మెంట్ ఇవ్వలేదు

ఓ మహిళ అబార్షన్ కేసులో తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చారని తనపై చేసిన ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని, దీనిపై 60 రోజుల్లో నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు సమాధానం ఇస్తామని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సదరు మహిళ కడుపు నొప్పితో ఆస్పత్రికి వచ్చిన సమయంలో తీవ్ర రక్తస్రావం జరుగుతుందన్నారు. వెంటనే ఓపీ స్లిప్ నంబర్ 40 రాసి, స్కానింగ్ తీయడం జరిగిందన్నారు. ఓపీ, స్కానింగ్ నెంబర్ వేర్వేరుగా ఉండడంతో కొంతమంది తెలిసి తెలియక తనపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి స్కానింగ్ తీసే అవసరం ఉండదని, దీంతో సీరియల్ నంబర్లు మారిపోతాయన్నారు. ఆ రోజు తాను డ్యూటీలో ఉన్నట్లు అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ విషయం కోర్టు పరిధిలో ఉండడంతో ఇంతకంటే ఎక్కువ చెప్పలేనన్నారు. రాజకీయ కుట్రలతో తన ఎదుగుదలను ఓర్వలేని కొంత మంది ఇలా పనిగట్టుకుని బదునాం చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో తాను తప్పు చేసినట్లు రుజు వైతే, స్వచ్ఛందంగా వెళ్లిపోతానన్నారు. ఒకవేళ సీఎం కేసీఆర్ ఆదేశిస్తే, సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేసేందుకు సైతం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

ఏబీవీపీ బంద్ విజయవంతం



ప్రభుత్వ పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకుల నిరసన

జనగామ: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం జనగామ జిల్లా బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట హృతిక్‌సాయి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై పోయిందన్నారు. రాష్ట్రంలో సుమారు 8 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు, టీచర్లు ఇబ్బందిలు పడుతున్నారన్నారు. నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడిచి పోతున్నా, ఇప్పటి వరకు వందశాతం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాల రమేష్, ఉమేష్, జగదీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ రఘుచందర్

స్టేషన్‌ఘన్‌పూర్: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ డి.రఘుచందర్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఘన్‌పూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ రఘుచందర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుంచి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కావొద్దని, చేతులారా జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాలను అరికట్టేలా అందరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.రాఘవేందర్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జనార్ధన్, సంధ్య, కావ్య, ప్రసన్నక్రిష్ణ, సీహెచ్‌ఓలు సాంబయ్య, వెంకటస్వామి, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి ఉగ్రప్రభ, త్వరితాక్రమాల్లో పూజలు





ఉగ్రప్రభక్రమం, త్వరితాక్రమంలో అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి దేవాలయంలో సోమవారం అమ్మవారిని ఉగ్రప్రభ, త్వరితాక్రమాల్లో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం స్వపనమూర్తిని దశమహా విద్యలలో ఆద్యవిద్యమైన కాళీక్రమంలో అష్టమి తిథికి ఆదిదేవత అయిన ఉగ్రప్రభ క్రమంలో అలంకరించారు. భోగభేరాన్ని షోడశీక్రమంలో త్వరితాక్రమంలో అలంకరించి పూజలు నిర్వహించారు. చతుఃస్థానార్చన జరిపారు.

ఎల్లమ్మకు ఆపన్నహస్తం..

● బాధిత మహిళను పరామర్శించిన ఆరోగ్య శ్రీ బృందం



చెన్నారావుపేట: ఓ పేద మహిళకు రెండు కిడ్నీలు పాడవడంతో బాగు చేయించు కోవడానికి చేతిలో చిల్లిగవ్వ లేక దీన స్థితిలో కొట్టిమిట్టాడుతోంది. ఆర్థిక సాయం చేసే దాతల కోసం వేయికండ్లతో ఎదురుచూసింది. ఈ తరుణంలో 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' అనే శీర్షికతో 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన కొందరు దాతలు రూ. 5వేల వరకు ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కమల్ చంద్ నాయక్, జిల్లా మేనేజర్ విక్రమ్, టీం లీడర్ మధు ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ బృందం ఆరె మహేందర్, కుమారస్వామి సోమవారం మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన పొన్నాల ఎల్లమ్మను పరామర్శించారు. వరంగల్‌లోని కేఎంసీలో పిస్టులా ఆపరేషన్ చేయించి ఆరోగ్యశ్రీ ద్వారా జయ హాస్పిటల్‌లో డయాలసిస్ చేయిస్తామని ధైర్యం చెప్పారు. అలాగే ప్రయాణ ఖర్చు లేకుండా ఉచిత బస్‌పాస్ అందిస్తామన్నారు. ఎల్లమకు ఆరోగ్యశ్రీ అండగా ఉంటుందన్నారు. కుటుంబ అవసరాలకు దాతలు సహకరించాలని కోరారు. దీంతో ఎల్లమ్మ కుటుంబ స భ్యులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మరో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమోదం


కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు మరో కార్యాలయానికి సోమవారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ నవీన్‌మిట్టల్ ఆమోదం తెలిపి ఉత్తర్వులను జారీ చేశారు. ములుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే భూపాలపల్లి జిల్లా దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేస్తుండగా భూ క్రయవిక్రయాదారుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వారి ఇబ్బందులు తీర్చడానికి నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమోదం తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.



'మార్పు' మంచికే..

పంట మార్పిడిని పాటించకుండా మూస పద్ధతిలో మందుకెళ్లడం.. పైగా సంవత్సరాల తరబడి ఒకే పంట వేయడం.. ఆపై అధికారుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోకుండా సాగు చేయడం వల్ల రైతులు నష్టాల బారిన పడుతున్నారు. భూమిలో ఎప్పటికీ ఒకే రకం పంటలు సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పంటల దిగుబడిలోనూ ప్రభావం చూపుతుంది. చీడపీడల వ్యాప్తి పెరుగుతూ వస్తుంది. ఫలితంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పంటల పెట్టుబడికి వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. తద్వారా అన్నదాతలు ఆర్థికంగా కృంగిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో దీనిని నివారించేందుకు గాను రైతులు తమ ప్రాంత స్థితిగతులను బట్టి పంట మార్పిడి చేసి.. నీటి వసతిని బట్టి సాగు చేపట్టి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

- కరీమాబాద్/కాజీపేట



పంట మార్పిడితో ఎన్నో ప్రయోజనాలు

- చీడపీడల వ్యాప్తికి అడ్డుకట్ట
- అధిక దిగుబడికి దోహదం
- భూసారం దెబ్బతినకుండా రక్షణ
- సాగులో మెళకువలు పాటించాలని అధికారుల సూచన

నీటి వసతిని బట్టి మళ్లీ మళ్లీ..

సాధారణంగా నీటి వసతులున్న చోట రైతులు వరి తర్వాత మళ్లీ వరి, మొక్కజొన్న పంటలు వేస్తారు. తర్వాత మళ్లీ మొక్కజొన్న, వేరుశనగ వేయడం ఆనవాయితీగా వస్తోంది. అంతేకాకుండా పత్తి, మిరప, పొగాకు తదితర వాణిజ్య పంటలను కూడా ఇదే పద్ధతిలో పండిస్తారు. దీంతో భూమిలోని ఒకే లోతు పొర నుంచి మొక్క.. పోషకాలు తీసుకోవడం వల్ల నేల నిస్సారమవుతుంది. ఇక పత్తి, మిరప, పొగాకు, కంది లాంటి పంటలు వేర్ల లోపలి పొరల నుంచి పోషకాలు తీసుకోవడం మూలంగా నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినడమే కాకుండా ఈ పైర్లను ఆశించే చీడపీడలు స్థిర నివాసమేర్పుకునే అవకాశముంటుంది. ఫలితంగా తర్వాత పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయి.

పంట మార్పిడి క్రమంలో..

రైతులు పంట మార్పిడి చేసే క్రమంలో ఆహార, వాణిజ్య పంటలు ఒకసారి అంటే ఖరీఫ్‌లో పప్పు జాతి (చిక్కుడు) వేస్తే రబీలో పంట మార్పిడి చేయాలి. అవసరమైనప్పుడు పశుగ్రాసం కోసం గడ్డి జాతి పైర్లు, భూసారం పెంచడానికి పచ్చిరొట్ట వేసుకోవాలి. పప్పుజాతి పంటల వేళ్ల బుడిపెలలోని రైజోబియం సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని మొక్కలకు అందిస్తాయి.

మార్పిడిలో పంటల సరళి..

పంటల మార్పిడి చేసే రైతులు వాటి సరళి(కాంబినేషన్)ని పాటిస్తే అద్భుత ఫలితం ఉంటుంది. ఇందులో భాగంగా పప్పుధాన్యపు పంట, ఆహార పంట, రుధాన్యాల ఆహార పంట, చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, మొక్కజొన్న, పొగాకు, మిరప, కూరగాయలు, చెరకు, వరి, కంది, జొన్న, మినుము, సోయాచిక్కుడు, ఆముదం, సజ్జ, జొన్న వంటి పంటలను మార్పిడిగా వేసుకోవాలి.

అంతర పంటలుగా మొక్కజొన్న,పెసర..

లోతు తక్కువైన ఎర్రనేలల్లో, సేంద్రియ పదార్థం తక్కువున్న నేలల్లో పత్తికి బదులు కందిలో అంతర పంటలుగా మొక్కజొన్న లేదా కందిలో పెసర లేదా మినుము పంటలను వేసుకోవచ్చు. అపరాల పంటలను వేయడం వల్ల వాటి వేర్ల బుడిపెలలో నివాసం ఏర్పరచుకునే ఒక రకమైన బ్యాక్టీరియాలు గాలిలోని నత్రజనిని గ్రహించి నేలలో స్థిరీకరిస్తాయి. దీనివల్ల తరువాత వేసే పైర్లకు నత్రజని వినియోగంలోకి వచ్చి మంచి ప్రయోజనకరం ఉంటుంది.

పంట మార్పిడి..ఫలితం..

- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరుకు వేయడం వల్ల సుడిదోమ, టుంగ్రోవైరస్‌ను నివారించొచ్చు.
- చెరుకు తర్వాత వరి వేయడం వల్ల వేరుపురుగు నివారించొచ్చు. వరిలో దోమపోటు నియంత్రించొచ్చు.
- పత్తి వేసిన భూమిలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చపురుగును నివారించొచ్చు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కంది వేస్తే కంది లో కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- పొలంలో ముందు పప్పుధాన్యం పైర్లు వే యడం మూలంగా నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడత నివారించడానికి పప్పుజాతికి చెందిన పైరుతో మార్పిడి చేయాలి.
- కంది, మిరపలో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- కందిపంటను జొన్న,మొక్కజొన్న, నువ్వుల పంటలతో మార్పిడి చేస్తే కాయ తొలిచే పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- నులిపురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పైర్లను కొన్ని పంటకాలాలు వేయొద్దు.
- ఆహార, వాణిజ్య పంటలను పశుగ్రాసం పైర్లతో ఒకసారి, పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం మేలు.

తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలి..



పంట మార్పిడి ద్వారా రైతులకు చాలా లాభాలున్నాయి. భూసారాన్ని కాపాడుకోవడంతోపాటు పంటల దిగుబడిలో కూడా తేడా వస్తుంది. ఖరీఫ్‌లో ఒక రకం, రబీలో మరో రకం పంటలు వేయడం వల్ల చీడపీడల వ్యాప్తిని అరికట్టొచ్చు. ఆహార పంటలు, వాణిజ్య పంటలను మార్పిడి చేసుకోవాలి.

- డాక్టర్ రాజు, శాస్త్రవేత్త

పంటల మార్పిడిపై దృష్టి సారించాలి



రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి. ప్రస్తుతం అనువైన సమయం. అందుకే తమ నేలలను భూసారపరీక్ష చేయించి ఫలితాలకు అనుగుణంగా వేయాల్సిన పంటలను నిర్ణయించుకోవాలి. తమకున్న నీటివసతి, నేల స్థితిగతులను బట్టి పంటల మార్పిడికి ప్రణాళికలు రూపొందించుకోవాలి.

- దొండపాటి శ్రీధర్‌రెడ్డి, ఏఓ, కాజీపేట

జీసీసీ డబ్బు.. ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి..

కేసముద్రం: జీసీసీ(గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్) ఖాతాలో పడాల్సిన రూ.16 లక్షలు ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలో జమ అయ్యాయి. నర్సంపేట జీసీసీ.. కేసముద్రం గిరిజన గురుకుల బాలికల కళాశాలకు నిత్యావసరాలు సరఫరా చేస్తుంది. ఇందుకు సంబంధించిన బిల్లులను ప్రతినెలా హెడ్‌ఆఫీస్‌కు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ఈ క్రమంలో 17 నెలలుగా జీసీసీ ఖాతాలో పడాల్సిన రూ.16 లక్షలు ఓ వ్యక్తి అకౌంట్‌లో జమ అయ్యాయి. ఈ విషయాన్ని జీసీసీ అధికారులు ఆలస్యంగా గుర్తించి గురుకుల పాఠశాలకు తెలిపారు. అంతకుముందు జీసీసీ అకౌంట్‌లోనే డబ్బు జమ అవుతున్నప్పటికీ, మరో వ్యక్తి ఖాతాలోకి ఏవిధంగా జమ అయ్యాయనే విషయం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రిన్సిపాల్ శైలజారాణిని వివరణ కోరగా.. జీసీసీ అకౌంట్‌లో పడాల్సిన రూ.16లక్షలు పొరపాటున వేరే వ్యక్తి ఖాతాలో జమయ్యాయని, ఈ విషయం తమ దృష్టికి రావడంతో, వెంటనే హెడ్‌ఆఫీస్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆ డబ్బును రికవరీ చేస్తున్నట్లు తెలిపారు.

బైక్, ఆటో ఢీ.. నలుగురికి గాయాలు

ఖిలా వరంగల్: ఖమ్మం జాతీయ రహదారిపై స్నేక్ డ్రైవ్‌తో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆటోను ఢీకొనడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని హంస బేకరి ఎదుట చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం రావూర్‌కు చెందిన ఆర్.శ్రీనిజ (23), ఖిలావరంగల్ మండలం తిమ్మాపురానికి చెందిన హరిత(23), జఫర్‌ఘడ్‌కు చెందిన మౌనిక(22), జక్కలొద్దికి చెందిన రాహుల్ (23) వీరంతా బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీఈడీ చదువుతున్నారు. సోమవారం ఉదయం టీచింగ్ ట్రైనింగ్ నిమిత్తం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చారు. సాయంత్రం 4 గంటలకు వర్ధన్నపేటకు వెళ్తున్న ఆటోలో బీఈడీ విద్యార్థులు ఎక్కారు. ఆటో ఎక్కిన పది నిమిషాల్లోనే రంగశాయిపేట ప్రాంతం తెలంగాణ కాలనీకి చెందిన ఓ వ్యక్తి రాంగ్‌రూట్‌లో ఓవర్‌స్పీడ్ స్నేక్ డ్రైవ్‌తో బైక్‌పై వెళ్తూ ఆటోను బలంగా ఢీకొట్టాడు. అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాకొట్టింది. శ్రీనిజ, హరితకు తీవ్రగాయాలు కాగా.. మౌనిక, రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు.మిల్స్‌కాలనీ ఎస్సై సాంబయ్య ఘటనస్థలానికి చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన పెసరు హరీశ్(23) పని నిమిత్తం తన పల్సర్ బైక్‌పై స్నేహితుడు పెసరు శ్రీరామ్‌తో కలిసి గ్రామం నుంచి రాత్రి 7.30 గంటలకు హనుమకొండకు బయలు దేరాడు. ఈ క్రమంలో నర్సింగరావు పల్లి దాటాక ధర్మసాగర్–మడికొండ బ్రిడ్జిపై వారి బైక్‌ను లారీ ఓవర్ టెక్ చేసి ఒక్కసారిగా బ్రేక్ వేసింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈ ఘటనలో హరీశ్ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీరామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీరామ్‌ను 108లో ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహారావు తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

● యువకుడు ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం

గూడూరు: మద్యానికి బానిసైన ఓ యువకుడు.. తల్లిదండ్రులను డబ్బు అడుగగా వారు నిరాకరించారు. దీంతో ఆవేశానికి గురైన ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బొల్లెపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పడిగె భద్రయ్య, స్వరూప దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. పెద్ద కొడుకు వెంకటేశ్ (22) చదువుకోకుండా తాగుడుకు బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లిదండ్రులను తనకు మద్యం సేవించేందుకు డబ్బు కావాలని అడగ్గా వారు ఇవ్వకుండా కూలికి వెళ్లారు. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. రాత్రి ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులకు కొడుకు ఉరివేసుకొని కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి భద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

- రోడ్డు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు
- సొసైటీకాలనీ శ్మశానవాటికలో ముగిసిన అంత్యక్రియలు
- తల్లిదండ్రులు, అక్కకు అంత్యక్రియలు నిర్వహించిన కుమారుడు అక్షయరాజ్



వీకర్స్ సెక్షన్ కాలనీలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు, స్థానికులు



తల్లిదండ్రులు, అక్క అంతిమయాత్రలో పాల్గొన్న అక్షయ్‌రాజ్

కాశిబుగ్గ : మేడారం వెళ్లొస్తూ హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పత్తిపాక రోడ్డు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్‌కాలనీకి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు అనుముల నర్సింహస్వామి, వెల్దండి సాంబరాజు, వెల్దండి ఆకాంక్ష, వెల్దండి లక్ష్మి ప్రసన్నలు దుర్మరణం చెందగా, అనుముల రాజశ్రీ, హర్షితలు తీవ్ర గాయాలపాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి మృతదేహాలను ఎంజీఎంకు తరలించి సోమవారం ఉదయం పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం నర్సింహాస్వామి నివాసానికి తరలించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి నలుగురి మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సొసైటీ కాలనీ శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అనంతరం దంపతులు వెల్దండి సాంబరాజు, ఆకాంక్షను ఒకే చితిపై పెట్టి వారి కుమారుడు అక్షయ్‌రాజ్‌తో అంతిమసంస్కారాలు చేయించారు. అలాగే అక్క లక్ష్మి ప్రసన్నను బొంద(పూడ్చి) పెట్టారు. నర్సింహాస్వామిని మరో చితిపై పెట్టి అతని కుమారుడు ఆకాశ్‌తో అంతిమ సంస్కారం చేయించారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఆర్థికసాయం

ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అనుముల రాజశ్రీ, హర్షితను వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం రాత్రి ఎంజీఎంలో పరామర్శించారు. సోమవారం ఉదయం వారి కుటుంబ సభ్యుల అంత్యక్రియలకు నరేందర్ రూ.25 వేలు, 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత అందించిన రూ. 15 వేలు ఆర్థికసాయాన్ని మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, వేముల నాగరాజు మృతుల కుటుంబానికి అందజేసి దగ్గరుండి వారి అంత్యక్రియలు నిర్వహించారు.

నకిలీ విత్తన ప్యాకెట్ల పట్టివేత

● ఒకరు అరెస్ట్, మరొకరు పరారు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

మరిపెడ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తొర్రూర్ డీఎస్పీ రఘు అన్నారు. సోమవారం మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టుపడిన నకిలీ పత్తి విత్తన వివరాలు వెల్లడించారు. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన రేఖ సురేశ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు బస్తాల్లో 90 కిలోల నకిలీ పత్తివిత్తన ప్యాకెట్లను పట్టుకున్నట్లు తెలిపారు. 40.5 కిలోలు బరువు కలిగి ఉన్న ఈ విత్తన ప్యాకెట్లపై అరుణోదయ సీడ్స్ అని ఉందన్నారు. కానీ ప్యాకెట్‌పై మ్యానిఫ్యాక్చరింగ్, లాట్‌నంబర్, లేబుల్ లేకుండా కేవలం పేరు అరుణోదయ సీడ్స్ అని మాత్రమే ఉందన్నారు. ఇది ప్రభుత్వం నిషేధించిన 'బీటీ-3' విత్తనాలుగా వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఈ నకిలీ విత్తనాల విలువ సుమారు రూ.1,35,000 ఉంటుందన్నారు. ఈ విత్తన ప్యాకెట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మక్కపేటలోని శివకుమార్ వద్ద కొనుగోలు చేసుకొని గుండెపుడికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితుడు సురేశ్‌పై కేసునమోదు చేసినట్లు తెలిపారు. శివకుమార్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారాలకు తావులేదన్నారు. నకిలీ విత్తనాల అక్రమాలపై పోలీస్ నిఘా ఉంచి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేరస్తులను గుర్తించి పట్టుకున్న ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది క్రాంతికుమార్, డ్రైవర్ సందీప్‌ను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో మరిపెడ సీఐ ఎన్.సాగర్, మండల వ్యవసాయ అధికారి వీరసింగ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓపై దాడికి యత్నం

● ఇద్దరిపై కేసు నమోదు

వెంకటాపురం(ఎం): స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్‌పై బుర్గుపేట గ్రామానికి చెందిన కొంతమంది యువకులు దాడికి యత్నించారు. దీనిపై ఎంపీడీఓ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎంపీడీఓ శ్రీనివాస్ విధి నిర్వహణలో భాగంగా పోడుభూముల సర్వేకోసం మండలంలోని అడవిరంగాపురం, మల్లయ్యపల్లి గ్రామాలకు స్కూటీపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బుర్గుపేటకు చెందిన భీంరావు, దుగ్యాల రాజుతో పాటు మరో నలుగురు కారులో ఎంపీడీఓను వెంబడించి దాడికి యత్నించారు. దీంతో ఎంపీడీఓ తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భీంరావు, రాజు,మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాజుద్దీన్ వెల్లడించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి హత్య



నడికూడ: ఓ గుర్తుతెలియని వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ ఘటన మండంలోని ధర్మారం శివారులో జరిగింది. ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్ కథనం ప్రకారం సోమవారం ఉదయం డయల్ 100 ద్వారా ధర్మారం గ్రామశివారులో గుర్తుతెలియని మహిళ(60) హత్యకు గురైనట్లు సమాచారం వచ్చింది. దీంతో పరకాల ఏసీపీ శివరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. అనంతరం ధర్మారం జీపీ కార్యదర్శి భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల సీఐ కిషన్ తెలిపారు.

అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మహబూబాబాద్ రూరల్ : రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని మల్యాల కేవీ కే సమన్వయ కర్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పత్తి పంటను న్యూమాటిక్ ప్లాంటర్ యంత్రంతో ఎలా వేసుకోవచ్చనే అంశంపై సోమవారం వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. మాలతీ మాట్లాడుతూ పత్తిసాగులో రైతులు ప్రస్తుతం పాటిస్తున్న పద్ధతుల ద్వారా విత్తితే మొక్కల సంఖ్య ఎకరానికి 5, 555 పడుతాయన్నారు. అలాగే, దిగుబడి తగ్గుతుందన్నారు. అదే వరుసల మధ్య 80 నుంచి 90 వరకు.. అలాగే మొక్కల మధ్య 20 సెంటీమీటర్లతో విత్తుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి భూక్య ఛత్రునాయక్, శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.

ఘర్షణకు దారి తీసిన భూవివాదం

- ఇరువర్గాల వాగ్వాదం
- అదుపు చేసిన పోలీసులు
- ఘర్షణకు దిగిన 30 మంది బైండోవర్



దళితులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

వర్ధన్నపేట: ఎన్నో ఏళ్ల క్రితం భూములను విక్రయించుకున్న వారు తిరిగి ఆ భూములు తమవే అని ధరణిలో సైతం పొందుపరిచి ఉన్నాయని సోమవారం దళితులు గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమి వద్దకు వెళ్లి అడ్డుకోవడంతో తీవ్ర ఘర్షణకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. వర్ధన్నపేటలోని కోనాపురానికి చెందిన దళితులకు 30 ఏళ్ల క్రితం ఆనాటి ప్రభుత్వం ఒక్కో దళిత కుటుంబానికి ఎకరం చొప్పున కేటాయించింది. ఆ భూమిని 25 ఏళ్ల క్రితం రాయపర్తి మండలం తెట్టెకుంట తండాకు చెందిన గిరిజనులకు విక్రయించుకున్నారు. వారు నాటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నారు. ఆ భూమి తమదే అని తాము కేవలం కౌలుకు మాత్రమే ఇచ్చామని ఆ భూమిలో సర్వహక్కులు తమకే ఉన్నాయని దళితులు వాదనకు దిగారు. సుమారు 100 మంది దళితులు గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమి వద్దకు వెళ్లి అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరు వర్గాలు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి పోలీస్ సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలను శాంతింపచేశారు. దళితులు ఆ భూముల వద్దకు వెళ్లవద్దని న్యాయస్థానం ద్వారా ఏమైనా ఆదేశాలు ఉంటేనే సరిపోతుందన్నారు. లేనిపక్షంలో గొడవకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవకు దిగిన 30 మంది దళితులను తహసీల్దార్ రవిచంద్రారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. సమస్య ఏదైనా ఉంటే న్యాయస్థానం ద్వారా తేల్చుకోవాలని సూచించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

దత్తత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి

● ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు



మాట్లాడుతున్న గోపాల్ రావు

హన్మకొండ: అధికారులు దత్తత తీసుకున్న గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఎస్.ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, కాలిపోయిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వైఫల్యాలను తగ్గించాలని సూచించారు. మరమ్మతులు ఆలస్యం కాకుండా చూడాలని, రోలింగ్ స్టాక్ ఉండేలా జాగ్రత్త పడాలని చెప్పారు. ఏడాది పైబడిన డిస్కనెక్షన్ సర్వీసులను తనిఖీ చేయాలని, సబ్ స్టేషన్ల నిర్వహణ ఎప్పటికప్పుడు నిర్వహించాలని పేర్కొన్నారు. లైన్ల పెట్రోలింగ్ చేపట్టాలని, వ్యవసాయ, టీఎస్ఐపాస్, నాయీబ్రాహ్మణ, దోభీఘాట్, లాండ్రీల సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సిబ్బంది విధిగా పని చేసే చోటే నివాసముండాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు కిషన్, అశోక్‌కుమార్, సదర్ లాల్, బీకంసింగ్, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, మహబూబాబాద్ ఎస్ఈ నరేశ్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.